క్లుప్తంగా

బాధితుడికి పరామర్శ

మరికల్: మండలంలోని మాధవరం గ్రామానికి ఎందిన బీజేపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు తన కుటుంబ సభ్యులతో కలిసి ఫిబ్రవరిలో కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ ఆయనను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేణుగోపాల్, రాజేష్, నర్సన్‌గౌడ్, తిరుపతిరెడ్డి, రమేష్, శ్రీరామ్ పాల్గొన్నారు.

విశ్రాంత పీఈటీకి సన్మానం

మక్తల్: వికరాబాద్ జిల్లా కొడంగల్ గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ విద్యార్థిని ఎం.మమత జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావడానికి కృషి చేసిన విశ్రాంత పీఈటీ గోపాలం ను కాలేజీ ప్రిన్సిపాల్ లిల్లీమేరీ, వైస్ ప్రిన్సిపాల్ సునీత శాలువతో సన్మానించారు. ఈ నెల 1 నుంచి 3వ తేదీల్లో నల్గొండ జిల్లాలోని జరిగిన షూటింగ్ బాల్ క్రీడల్లో మమత ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



మద్దూరు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని సీజ్ చేసిన ఘటన బుధవారం మద్దూరులో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు నాగంపల్లి వాగు నుంచి ఇదే గ్రామానికి చెందిన బంటు శేఖర్, జోగు లాలప్పలకు చెందిన ట్రాక్టర్లు అర్ధ రాత్రి అక్రమంగా ఇసుకను తవ్వి ఖాజీపూర్‌కు తరలించే క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జనరిక్ మెడికల్ దుకాణంలో ఎంపీ



పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న జనరిక్ మెడికల్ దుకాణాన్ని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సందర్శించారు. ట్యాబ్లెట్స్, సిరాప్‌లు ఇతర డ్రగ్స్‌ను ఎంపీ పరిశీలించారు. జనరిక్ మందులను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా విక్రయాలు జరపరాదన్నారు. అన్ని రకాల డ్రగ్స్‌ను రోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. మందుల కాల పరిమితి తరచుగా తనిఖీ చేస్తుండాలని, కాలం చెల్లిన వాటిని విక్రయించరాదన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఎంఓ దుర్గా పాల్గొన్నారు.

బహుజనులకు మంత్రి పదవులు ఇవ్వాలి



కోయిల్‌కొండ: తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 15 మంత్రి పదవులు ఇవ్వాలని బీసీ జనచైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఆచార్యపూర్ గ్రామంలో బీసీ కులాల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం తెలంగాణ రాష్ట్రం నుంచే ప్రారంభించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పదవికి రాజీనామా చేసి బీసీని సీఎం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో విద్య, వైద్యం జాతీయం చేయాలన్నారు. సంపదను అన్ని వర్గాలకు సమానంగా దక్కాలన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ

నవాబుపేట: మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలందరికి పని చేసేచోట ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఉపాధి సిబ్బందితో కలిసి ప్రారంభించినట్లు ఆయన వివరించారు. కూలీలు సైతం పనులు చేసేందుకు ఉదయం త్వరగా వెళ్లి త్వరగా ఇంటికి చేరుకోవాలని ఆయన సూచించారు. సందర్భంగా ఆయన వెంట ఏపీఓ జ్యోతి, సిబ్బంది జంగమ్మ, పాండు, వెంకటేష్, బుచ్చయ్య, జనార్దన్ ఉన్నారు.



మద్దూర్‌లో పరీక్ష కేంద్రానికి పరుగెడుతున్న విద్యార్థిని



డీసీఎంలో పరీక్ష కేంద్రానికి వచ్చిన కొండాపూర్ గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు



కోస్గిలో విద్యార్థులకు రూం నంబర్లు చూయిస్తున్న పోలీసు

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు

సాక్షి, నెట్‌వర్క్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఐదు నిమిషాల నిబంధన తీసుకురావడంతో విద్యార్థులకు ఊరట లభించింది. గతంలో నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోవడంతో చాలా మంది విద్యార్థులు పరీక్ష రాయకుండానే నిరాశతో వెనుదిరిగేవారు. పరీక్షా కేంద్రంలో అధికారులు విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కొత్తగా సీసీ కెమెరాలతో ఉన్నతాధికారులు నిత్యం కేంద్రాలపై నిఘా ఉంచనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అములులోకి తెచ్చారు.



ఊట్కూరులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ లింగయ్య

⇨ మక్తల్ ప్రభుత్వ జూనియర్ కలశాలలో 308 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 301మంది, మైనార్టీ గురుకుల పాఠశాలలో 384 మంది విద్యార్థులకు 376 మంది, స్కాలర్స్ కళాశాలలో 331మంది విద్యార్థులకు గాను 318 మంది పరీక్షకు హాజరయ్యారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థి పరీక్ష రాస్తున్న సమయంలో స్పృహ తప్పి పడిపోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐలు వైపీ లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కస్టోడియల్ అధికారి రామస్వామి, సీహెచ్ దత్తాత్రేయ, డీఓలు రమేష్, వెంకటేశ్వర్, మంజునాథ్, సీఎస్‌లు శ్వేతా రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

⇨ మాగనూర్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో 189 మంది విద్యార్థులకు గాను 187 మంది పరీక్షలు రాశారు.

⇨ మరికల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలో 257 మంది విద్యార్థులకు 253 మంది పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ మణిమాల తెలిపారు.

⇨ కోస్గి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 388 మంది గాను 379 మంది, ప్రజ్ఞ కళాశాల పరీక్ష కేంద్రంలో 335 మందికి 321 మంది పరీక్ష రాశారు.

⇨ ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 184 మంది విద్యార్థులకు గాను 179 మంది, తెలంగాణ మోడల్ పాఠశాలలో మొత్తం 163 మంది విద్యార్థులకు గాను 158 మంది విద్యార్థులు హాజరయ్యారు.

⇨ మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్షకు 168 మంది, హిందీ పరీక్షకు 24 మంది విద్యార్థులు రాశారని ఇన్‌చార్జ్ రాములు తెలిపారు.

⇨ ఊట్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్షకు 144 మంది విద్యార్థులకు గాను 137 మంది విద్యార్థులు హాజరయ్యారు. తహసీల్దార్ చింత రవి, డీఎస్పీ లింగయ్య పరీక్ష కేంద్రాన్ని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. బందోబస్త్ నిర్వహిస్తున్న ఎస్ఐ కృష్ణంరాజుతో మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో..



మక్తల్‌లో..



మక్తల్ మైనార్టీ గురుకుల పాఠశాల వద్ద స్పృహ తప్పి పడిపోయిన విద్యార్థిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

'నిర్మాణ పనుల్లో జాప్యం తగదు'



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్


నారాయణపేట ఎడ్యుకేషన్: కొడంగల్ నియోజకవర్గంలో మంజూరైనా నిర్మాణ పనుల్లో జాప్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తా పట్నాయక్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు నిర్మాణ పనులు, ఎలక్ట్రిసిటీ, తాగునీరు, భగీరథ పైపులైన్లు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల ద్వారా మంజూరైనా వివిధ నిర్మాణ పనులు సకాలంలో కాంట్రాక్టర్లు పూర్తి చేసి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆదేశించారు. ఈడబ్ల్యూఐడీసీ ద్వారా మంజూరైనా బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్మాణానికి మొదలుపెట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆర్ అండ్ బీ ద్వారా వెటర్నరీ, వైద్య కళాశాలలకు సంబంధించిన పనులు త్వరలో మొదలు పెట్టాలని, దుద్యాల, హకీంపేట రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన ఫొటోలు ప్రతి రోజు గ్రూప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పనులు జరుగుతున్న సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, నారాయణపేట ఆర్డీఓ రాంచందర్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్ నాయక్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ లీలావతి, ఈడబ్ల్యూఐడీసీ రాంకుమార్, ఇంజినీరింగ్ విభాగం ఈఈలు, డీఈలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కోస్గి: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కోస్గికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. హైదరాబాద్‌లో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు జరిగిన 13వ ఓపెన్ స్టేట్ లెవల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో కరాటే మాస్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో కోస్గి నుంచి 37 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఇద్దరు బంగారు పతకాలు, ఒకరు వెండి పతకం సాధించగా.. 31 మంది ప్రతిభ మెడల్స్ అందుకున్నారు. విజేతలకు రాష్ట్ర ఒలంపిక్ సంఘం కార్యదర్శి మల్లారెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు చేరుకుంటారన్నారు. మద్దూరు మండలంలోని రెనివట్ల జిల్లా పరిషత్,, కృష్ణా మండలంలోని గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలలో, ఊట్కూరు మండలంలోని పెద్దజట్రం, ధన్వాడ బాలుర, గున్ముక్ల, కొత్తపల్లి మండలంలోని నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి, బొమ్మాన్పాడ్ జెడ్పీ, సింగారం యూపీఎస్ పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎంలు నరసింహచారి, గణేష్‌సింగ్, ఎంఈఓ నిజాముద్దీన్, ఉపాధ్యాయులు వీరన్న, బాలరాజు, సతీష్, బ్రహ్మయ్య, సాయికుమార్, రాజేష్, రాజశేఖర్, సలాఉద్దీన్, తిరుమలరావు, శ్రీనివాసులు, అర్జున్, చంద్రశేఖర్, రాజన్న, లాజర్, విజయ్, శ్రీనివాస్, వేణుగోపాల్, ఆనందం, సుజాత, కతలప్ప, బీంషేన్, నగేశ్, షఫి, బసవరాజు, బాలప్ప, వెంకటరాములు, అనీల్, గోపాల్, కల్పన, తిరుమలేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పెద్దజట్రం పాఠశాలలో..

వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ ప్రారంభం



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం వెయిట్ లిఫ్టింగ్ శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, లేబర్‌శాఖ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా వాలీబాల్ సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి చెన్నవీరయ్య, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ పాల్గొన్నారు. వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ చంద్రశేఖర్‌గౌడ్ పర్యవేక్షణలో జరుగుతుందని డీవైఎస్ఓ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడాశాఖ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, కోచ్‌లు సునీల్‌కుమార్, అంజద్, కంప్యూటర్ ఆపరేటర్ జి.ఉమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక శిక్షణకు జేపీఎన్‌సీఈ ఒప్పందం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌తో జేపీఎన్‌సీఈ కళాశాల బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థుల పారిశ్రామిక శిక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తారని, దీని ద్వారా సులభంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

నేడు గుడెబల్లూర్‌లో కంటి వైద్య శిబిరం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ రైతువేదికలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వాకిటి శ్రీహరి సేవా సమితి వ్యవస్థాపకుడు రవికుమార్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కందూరు రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో మండలంలోని వయో వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఆర్టీయూ నాయకుల విజయోత్సవ సంబరాలు

కృష్ణా: మండలంలోని కస్తూర్బా, కున్సీ, ముడుమాల్, కృష్ణా, గుడెబల్లూర్ పాఠశాలల్లో బుధవారం పీఆర్టీయూ నాయకులు ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు మిఠాయిలను పంచారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి ఘనవిజయం సాధించడం ఉపాధ్యాయుల సంఘటిత శక్తికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధ్యమేనని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల గౌరవ అధ్యక్షుడు నల్లె శివరాజ్, మండల ప్రధాన కార్యదర్శి అజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా ఉపాధ్యాయులకు స్వీట్లు పంచుతున్న పీఆర్టీయూ నాయకులు

నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

కొత్తపల్లి: మండలంలోని కిషన్‌నగర్, కొత్తపల్లి గ్రామాల నర్సరీలను బుధవారం ఎంపీడీఓ కృష్ణారావు పంచాయతీ కార్యదర్శులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున నర్సరీల్లో మొక్కలు ఎండ తీవ్రతతో చనిపోయే అవకాశం ఉందని, చనిపోయిన మొక్కల స్థానాల్లో కొత్త విత్తనాలు నాటి మొక్కలకు సరైన మోతాదులో నీరు అందించాలని సూచించారు. నర్సరీల్లో ఎండ వేడి తగలకుండా షాడో నెట్, నీడ పందిరిలు తక్షణమే ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. రాబోయే వర్షాకాలం నాటికి ప్రతి నర్సరీలో నిర్ధేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, తిరుపతి, ఫీల్డ్ అసిస్టెంట్లు కేశవులు, మైబన్న పాల్గొన్నారు.

వరిసాగులో సస్యరక్షణ చర్యలు

దామరగిద్ద: యాసంగిలో వరి పంటలను ఆశిస్తున్న అగ్గితెగులు, బీఎల్‌బీ, పోషక లోపాల నివారణకు మందుల పిచికారీతో ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మణిచందర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కాన్‌కుర్తి, దామరగిద్ద, దామరగిద్దతండా తదితర గ్రామాల్లో వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అగ్గితెగులు వ్యాప్తి అధికంగా ఉందన్నారు. వరి ఆకుల మీద, వెన్ను మెడ భాగాల మీద, ఆకులపై నూలకండే ఆకారం కలిగిన గోధుమ రంగు అంచులు గల మచ్చలు ఏర్పడి, మచ్చల మధ్యలో బూడిద రంగు ఉంటుందన్నారు. పిలకల కనుపుల వద్ద తెగులు ఆశిస్తే పిలకలు విరిగి వాలి పోతాయని వివరించారు. వెన్ను మెడ భాగంలో నల్లటి మచ్చలు ఏర్పడి వెన్ను విరిగి వేలాడుతుందన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజెల్ 0.6 గ్రాములు లేదా కాసుకామైసిన్ 2.5 ఎంఎల్ లేదా ఐసోప్రోతనిల్ 1.5 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.



దామరగిద్ద శివారులో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ మణిచందర్

విజ్ఞానయాత్రలో కాన్‌కుర్తి విద్యార్థులు

దామరగిద్ద: విజ్ఞాన విహార యాత్రలో భాగంగా మండలంలోని కాన్‌కుర్తి జీపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాఠశాల హెచ్ఎం షేర్ కృష్ణారెడ్డి సమక్షంలో తరలివెళ్లారు. బుధవారం హైదరాబాద్‌లో గోల్కొండ కోట, సాలార్‌జంగ్ మ్యూజియం, ఏయిర్‌పోర్టు, సమతామూర్తి క్షేత్రాలను సందర్శించారు. పుస్తకాల్లో చదవడం కంటే ప్రత్యక్ష అనుభవాన్ని కలిగించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రాచీన కట్టడాలు, మ్యూజియం వంటి వాటిని సందర్శించామన్నారు. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు కవిత, మౌనిక, అపర్ణ, బాబుమియా, శ్రీనివాసులు ఉన్నారు.



సాలార్‌జంగ్ మ్యూజియం సందర్శించిన విద్యార్థులు

'సైన్స్‌తో మేధాశక్తి పెంపొందుతుంది'

అమరచింత: సైన్స్‌ఫేర్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మేదస్సు పెరుగుతుందని మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్ అన్నారు. సైన్స్‌డే ను పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఆయా తరగతుల విద్యార్థులు పలు రకాల బోధన పరికరాలను తయారు చేసి, వాటి గురించి తల్లిదండ్రులతో పాటు తోటి విద్యార్థులకు వివరించారు. సైన్స్‌ఫేర్ తిలకించడానికి పట్టణంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనల గురించి తెలుసుకుంటున్న ఎంఈఓ భాస్కర్‌సింగ్

సీసీ వేశారు.. మట్టి మరిచారు

అమరచింత: పట్టణంలోని జములేశ్వరి ఆలయం వరకు రూ.5 లక్షలతో నూతనంగా సీసీ రోడ్డును నిర్మించినా.. ఇరువైపులా మట్టిని వేయడం మరిచారు. కచ్చరహదారిపై సీసీ వేయడంతో రోడ్డుకు ఇరువైపులా ఆరు ఇంచుల మేరకు ఎత్తు ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు వాటిని తప్పించబోయి కిందపడుతున్న పరిస్థితులు దాపరించాయి. సీసీ రహదారి నిర్మాణ పనులు పూర్తై నేటికి ఐదు నెలల గడుస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ రహదారులకు ఇరువైపుల మట్టిని వేయక పోయినా అధికారులు మాత్రం బిల్లులు ఇవ్వడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయించాలని కోరుతున్నారు.



జములమ్మ ఆలయానికి వేసిన సీసీ రహదారి

సీతారామ కల్యాణం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉత్తరాపల్లి రామాచారి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేసీదాస్ స్మారకసేవా సంస్థ ఆధ్యాత్మిక అనుబంధ సంస్థ సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో ఈనెల 9న స్థానిక వెంకటేశ్వరకాలనీలోని శ్రీలక్ష్మీహయగ్రీవ, శ్రీపంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రాలను బుధవారం జిల్లాకేంద్రంలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉమ్మడి జిల్లా హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి, సనాతన ధర్మ వారధి సంస్థ ప్రతినిధులు భరత్‌కుమార్, వేముల మనోహర్‌రావు, ప్రవీణ్‌కుమార్, రాఘవేంద్రరావు, రామకృష్ణ ప్రసాద్, సునీల్‌కుమార్, శిరీష, దేవాలయ కమిటీ సభ్యులు గోవర్ధన్, మోహన్‌కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైంది

రాజాపూర్: ఎంతోమంది మేధావులు, దేశ ప్రధానులు, మంత్రులు, శాస్త్రవేత్తలు ఇలా ఎంతో మంది ఉత్తమమైన పదవుల్లో ఉన్నవారు ఒకనాటి ఉపాధ్యాయుడి శిష్యులేనని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య పేర్కొన్నారు. బుధవారం రంగారెడ్డిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పదవీ విరమణ పొందిన నాగయ్య వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయవృత్తి ఎంతో గౌరవమైందన్నారు. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన ఈ వృత్తిలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు నాగయ్యను సన్మానించారు.